ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఆక్రమణలపై 78 ఫిర్యాదులు..

అధికారులు మీ వద్దకే వచ్చి విచారిస్తారు..

నాలుగు వారాల్లో సమస్య పరిష్కారం కాకుంటే.. నేనే వచ్చి విచారిస్తా

హైడ్రా ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, జనవరి 27(నమస్తే తెలంగాణ): ఆయా ప్రాంతాల్లో జరిగే ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి హైడ్రా అధికారులు ఆ ప్రాంతాల ప్రజల వద్దకే వచ్చి విచారిస్తారని, సంబంధిత పత్రాలను ఇచ్చి విచారణకు సహకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులకు సంబంధించి ఆక్రమణలపై 78 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ రంగనాథ్ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి.. వారి సమక్షంలోనే గూగుల్ మ్యాప్స్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించి.. పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ గ్రామం సర్వే నంబర్ 119 నుంచి 220 వరకు ఉన్న 408 ఎకరాల్లో అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపించాలని గతంలో అక్కడ ఇంటి స్థలాలు కొన్నవారు ఫిర్యాదు చేశారు. అలాగే.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం, కుంట్లూర్ పెద్ద చెరువులో 2 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని, 59జీవో ప్రకారం రెగ్యులరైజ్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని మొదటి డివిజన్‌లో 2,900 గజాల పార్కును స్థానికులు కొందరు కబ్జా చేస్తున్నారని కేపీఆర్ రెయిన్‌బో కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పెంచి తమ ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదంటూ వాసవి గ్రాడ్యుయేట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి తీసుకున్న ఫిర్యాదులను ఆయా ఏరియా అధికారులకు కేటాయించి.. ప్రజల సమక్షంలోనే విచారణ జరపాలని, స్థానిక అధికారుల నుంచి పూర్తి వివరాలు తీసుకుని లోతైన విచారణ చేయాలని ఆదేశించారు. రెండువారాల్లో అధికారులు వచ్చి విచారణ చేపడతారంటూ వారి ఫోన్ నంబర్లను ఫిర్యాదుదారులకు కమిషనర్ ఇవ్వడమే కాకుండా నాలుగువారాల్లో సమస్య పరిష్కారం కాకుంటే తానే స్వయంగా వచ్చి విచారణ చేపడుతానంటూ తెలిపారు. సమగ్రంగా విచారణ జరిపించి కబ్జాదారులపై కేసులు పెట్టాలని, కబ్జాల చెర నుంచి కాపాడిన ప్రభుత్వ భూముల వద్ద ప్రొటెక్టెడ్ బై హైడ్రా అని బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలు పెరుగుతున్నాయన్న ఫిర్యాదులపై మ్యాపులను పరిశీలించాలని, ముందుగా అమీన్‌పూర్ చెరువు, దుర్గం చెరువు, మాసబ్ చెరువు, మన్సూరాబాద్ పెద్ద చెరువులను పరిశీలించాలని కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

కోరిక తీర్చుకొని కడతేర్చాడు..

డబ్బులు అడిగినందుకు బండరాయితో కొట్టి..

ఆపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు..

మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్ట్

వివరాలను వెల్లడించిన మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్,జనవరి 27: తన లైంగిక కోరికను తీర్చుకున్నాక డబ్బులు అడిగిన మహిళను బండరాయితో తలపై బాది..ఆపై పెట్రోల్ పోసి తగులపెట్టి పరారయ్యాడు. సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ నెల 24న మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామం ఓఆర్ఆర్ కల్వర్టు సమీపంలో రెండు చేతులపై ఆభరణాలు, పచ్చబొట్టు గుర్తులతో ఉన్న మహిళ హత్యకు గురికాగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి చేతిపై ఉన్న ఆభరణాలు...పచ్చబొట్టు పేర్లతో పాటు ఇతర ఆనవాళ్లు సేకరించి ఆచూకి కోసం ఆయా పోలీస్‌స్టేషన్లకు పంపించారు. దీంతో మృతురాలు నిజామాబాద్ జిల్లా బోధన్ శెట్టిపేట్‌కు చెందిన ఇరుగడిండ్ల శివానంద(45)గా తేలింది. వెంటనే బాధిత కుటుంబాన్ని విచారించగా.. ఆమె.. భర్త సాయిలుతో గొడవ పడి నగరానికి వలస వచ్చి ఈసీఎల్, కొంపల్లి ప్రాంతంలో ఉంటూ రోజువారి కూలీ పనులు చేసుకుంటుందని తేలింది.

కాగా.. కరీంనగర్ జిల్లా కమలాపురం ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్మామ్ శామీర్‌పేట్‌లోని మజీద్‌పూర్‌లో ఉంటూ డేవిడ్ స్టోన్ కటింగ్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 23న బండలు కటింగ్ చేసే బ్లేడ్‌లు కొనుగోలు చేసేందుకు మేడ్చల్‌కు వచ్చాడు.అదే సమయంలో బస్టాండ్ సమీపంలో శివానందతో పరిచయం ఏర్పడింది. తన లైంగిక కోరికను తీర్చేందుకు రూ.500 ఇచ్చి.. ఆమెను బైక్‌పై ఎక్కించుకొని మునీరాబాద్ ఓఆర్ఆర్ కాజ్‌వే కింద నిర్మానుష్యప్రాంతానికి తీసుకెళ్లాడు. లైంగిక కోరిక తీర్చుకున్నాక మృతురాలు మరో రూ.500 ఇవ్వాలని అడుగగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆవేశంతో షేక్ ఇమ్మామ్ ..సదరు మహిళను బండరాయితో తలపై కొట్టి.. తన బైక్‌నుంచి పెట్రోల్ తీసి నిప్పంటించి పరారయ్యాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో మేడ్చల్ అడిషనల్ ఏసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, డీఐ సుధీర్‌కృష్ణ, దుండిగల్ సీఐ సతీశ్, జీనోమ్‌వ్యాలీ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఓటీ సీఐ శ్యామ్ సుందర్‌రెడ్డి, మేడ్చల్ ఎస్ఐలు మన్మధరావు, అశోక్‌తో పాటు సీసీఎస్ మేడ్చల్, బాలానగర్ టీంలు ఉన్నాయి.

అవినీతిపై విచారణ జరిపించండి

క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి నరేందర్ యాదవ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి, జనవరి 27: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణలో గత 28 ఏళ్లుగా ఉన్నత అధికారులుగా చెలామని అయ్యి కోట్లాదిరూపాయల కుంభకోణానికి పాల్పడుతున్న కళ్యాణితోపాటు సహకరించిన నలుగురిపై దర్యాప్తు చేయాలని తెలంగాణ క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి నరేందర్ యాదవ్ కోరారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా ఉత్సవాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో సగం దోచుకున్నట్టు తెలుస్తోన్నది. గన్‌ఫౌండ్రీలోని గోల్కొండ లేపాక్షి స్టోర్ నుంచి ఒక మెమోండోకు లక్ష 50 వేల రూపాయలతో 20 మెమోండోలు కొనుగోలు చేసినట్టు బిల్లును చూసిస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ అవినీతి జరిగినట్లు సమాచారం ఉన్నది. కావునా ఏసీపీ అధికారులు దాడులు నిర్వహించి వారిని విచారించవలసిందిగా కోరుతూ ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఆమెకు జంట నగరాల్లో నాలుగు విలాసవంతమైన భవనాలు ఉన్నాయని, ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లలో కూడా అనేక అవకతవకలకు పాల్పడి లక్షలాది రూపాయలను కొట్టేసినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణలో నిర్వహిస్తున్న ఆరు అకాడమీలలో కూడా ఆమె అవినీతి చాలా ఉన్నదని, వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖాళీగా ఉందని కబ్జా చేశాడు..

502 గజాల స్థలాన్ని కాపాడిన రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్, జనవరి 27: ఖాళీగా ఉన్నదని ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తులకు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్న 502 గజాల స్థలాన్ని ఆక్రమణలనుంచి కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండలం సర్వే నం.102/1పీ కిందకు వచ్చే షేక్‌పేట గ్రామ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.12 ఎమ్మెల్యే కాలనీ వెనకభాగంలో ఖరీదైన ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. ముళ్లపొదలు, చెట్లు ఉండడంతో లోనికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. దీన్ని సాకుగా తీసుకున్న కాలనీకి చెందిన ఓ వ్యక్తి సుమారు 502 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని ప్రహారీ నిర్మాణం చేపట్టాడు. ఆక్రమించుకున్న స్థలంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతో పాటు లాన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు పనులు చేస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సోమవారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి వెళ్లి ఆక్రమణలను పరిశీలించారు. స్థలం చుట్టూ నిర్మించిన ప్రహారీని కూల్చడంతో పాటు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

కబ్జాకు గురయిన స్థలం మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.12కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు తెలిపారు.

భూతల స్వర్గంలా ఎక్స్‌పీరియం

150ఎకరాలు.. 450 కోట్లతో ఏర్పాటు..

25 వేల జాతుల మొక్కలు, చెట్లు..

85 దేశాల నుంచి అరుదైన మొక్కలు దిగుమతి..

చేవెళ్లలోని పొద్దుటూరి రెవెన్యూ పరిధిలో వెలసిన గార్డెన్

నేడు ప్రారంభం

మొయినాబాద్, జనవరి 27 : ప్రపంచ స్థాయిలో, ఇండియాలోనే అనేక ప్రత్యేకతలు సొంతం చేసుకున్న గొప్ప ప్రాజెక్టు ఈ–ఎక్స్ పీరియం పార్కు. ప్రపంచ దేశాల్లోని అరుదైన జాతుల మొక్కలు నాటడంతో పాటు అరుదైన సహజ సిద్ధమైన రాతి శిలలు ఇందులో కనిపిస్తాయి. వందల, ఏండ్ల వయస్సు ఉన్న చెట్లతోపాటు రకరకాల పూల జాతుల మొక్కలు పార్కులో కనిపిస్తాయి. సుమారుగా 150 ఎకరాల విస్తీర్ణంలో రూ.450 కోట్లతో ఎక్స్ పీరియం గార్డెన్‌ను చేవెళ్ల నియోజకవర్గంలోని పొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేశారు. గార్డెన్ చైర్మన్ వరంగల్ జిల్లాకు చెందిన రామ్‌దేవ్‌రావు అనే పర్యావరణ ప్రేమికుడు.. తన తండ్రి స్ఫూర్తితో 25 ఏండ్ల నాటి కలను సాకారం చేసుకోబోతున్నాడు. ప్రకృతి, పర్యావరణాన్ని భావితరాల వారికి అందించాలనే సంకల్పంతో గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచంలోని 175 దేశాల్లో పర్యటించి.. 85 దేశాల నుంచి అనేక రకాల జాతుల మొక్కలను, చెట్లను తీసుకొచ్చి గార్డెన్‌లో పెట్టారు. రామ్‌దేవ్‌రావు 25 ఏండ్ల నాటి కలను సాకారం చేసుకోవడంతో పాటు పది మందికి సంతోషాన్ని ఇవ్వాలని , ఉపాధి కల్పించాలని, వీటన్నింటిని మంచి ప్రకృతిని, పర్యావరణానికి మేలు చేయాలని సంకల్పించారు. కలను సాకారం చేసుకోవడానికి 12 ఏండ్ల క్రితం యూనిక్ ట్రీస్ అనే కంపెనీ పెట్టారు. దాని ద్వారా ప్రపంచ స్థాయి గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించిన ఆయన.. ఎక్స్ పీరియం అనే అద్భుతమైన గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దేశానికి తలమానికంగా మారనున్న భూతల స్వర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నేడు ప్రారంభం కాబోతుంది.

150 ఎకరాలు.. 25 వేల జాతుల మొక్కలు

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని పొద్దుటూరు గ్రామ రెవెన్యూలో 150 ఎకరాల్లో 25 వేల జాతుల మొక్కలు ఏర్పాటు చేశారు. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న 10 లక్షల మొక్కలను, చెట్లు.. ఎక్స్ పీరియం గార్డెన్‌లో కనిపిస్తాయి. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు సుమారుగా రూ. లక్ష నుంచి 3.5 కోట్ల విలువైనవి. సుమారుగా రూ.150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు , వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక, పర్యావరణ ప్రదేశంగా ఏర్పాటు అయ్యింది. అదే విధంగా రూ. 5 లక్షల నుంచి రూ.కోటి రూపాయల విలువైన శిల్పాలను గార్డెన్‌లో ప్రదర్శించారు. రూ.50 కోట్ల ఖర్చుతో 150 ఎకరాలు విక సించేలా గ్లోగార్డెన్‌ను తయారు చేశారు. చెట్లతో చేసిన అత్యధిక సజీవ శిల్పాలు కలిగిన ఏకైక శిల్పకళాకేంద్రంగా రూపాంతరం చెందింది. గార్డెన్‌లో మొక్కలు , శిల్పాలతో పాటు ఇండియాలో ఎక్కడ లేని విధంగా అత్యధిక అడ్వెంచర్ గేమ్స్ ఉన్నాయి. ఇందు లో 15 వందల మంది సామర్థ్యం గల లార్జెస్ట్ హంపి థియేటర్‌ను నిర్మించారు. దేశం లో ఇప్పటి వరకు లేని విధంగా అక్వేరియం రెస్టారెంట్ ను ఏర్పాటు చేశారు. దేశంలో ఇప్ప టి వరకు ఎక్కడ కూడా ఏర్పాటు చేయని విధంగా అతి పెద్ద స్నో పా ర్కు, అతి పొడవైన బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే ఏ దేశంలో లేని రీతిలో మొట్ట మొదటి కాఫీ షాపు సహజ రాతి బార్ కౌంటర్, ఆర్టిఫిషియల్ మౌట్స్ ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో గార్డెన్‌లోని 12 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల ఖర్చుతో మ్యాన్ మేడ్ బీచ్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

5 వేల ఏండ్ల క్రితం చెట్టు కింద బుద్ధ విగ్రహం

గార్డెన్‌లో పైకస్ జాతికి చెందిన 5 వేల సంవత్సరాల క్రితం చెట్టును ఏర్పాటు చేశారు. గౌతమ బుద్ధుడు ఇదే చెట్టు కింద జ్ఞానోదయం పొందినట్టుగా.. పార్కుకు వచ్చే సందర్శకులు బుద్ధుడు జ్ఞానోదయం పొందిన చెట్టు ఇదే అన్నట్టుగా ఏర్పాటు చేశారు. చెట్టు ప్రధాన వేరు భాగానికి రంధ్రం చేసి బుద్ధుడు తపస్సు చేస్తున్నట్టుగా తయారు చేశారు. చెట్టు అందరిని ఆకట్టుకునే విధంగా కమలం పువ్వులా డిజైన్ చేశారు. అదే విధంగా జీవంతో ఉన్న చెట్లతోనే కుర్చీలు, బల్లాల మాదిరిగా చెట్లను ఏర్పాటు చేశారు. 2008లో జరిగిన ఒలంపిక్స్ గేమ్స్‌లో వేలం పాటలో ఒక అరుదైన చెట్టును రూ.80 లక్షలకు రామ్‌దేవ్‌రావు కొనుగోలు చేసి..దానిని గార్డెన్‌లో అందంగా ఒలంపిక్ సింబల్ మాదిరిగా ఏర్పాటు చేశారు.

బాస్కెట్‌బాల్ చాంప్ సెయింట్ అండ్రూస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ టోర్నీలో సెయింట్ అండ్రూస్ టీమ్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన బాలుర అండర్–13 ఫైనల్లో సెయింట్ అండ్రూస్ 15–10తో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై విజయం సాధించింది. అండ్రూస్ తరపున రేవంత్(5), ఆర్యన్(5) రాణించారు. బాలికల అండర్–13 ఫైనల్లో ఆండ్రూస్ టీమ్ 10–6తో హోలీ ఫ్యామి గర్ల్స్ హైస్కూల్‌పై గెలిచింది. బాలుర అండర్–15 తుది పోరులో సెయింట్ పాయిస్ 15–10తో సెయింట్ అండ్రూస్ గెలిచి టైటిల్ దక్కించుకుంది.

ఎలక్ట్రీషియన్‌గా చేరి.. 52 లక్షలతో ఉడాయించాడు

నిందితుడు అరెస్ట్

కుత్బుల్లాపూర్, జనవరి 27 : ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఎలక్ట్రీషియన్‌గా చేరి..అందులో ఉన్న ఓ ఫ్లాట్‌లో రూ.52.5 లక్షలను చోరీచేసి..చివరకు పోలీసులకు చిక్కి జైలు పాలయ్యాడు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలను వెల్లడించారు. మెదక్‌కు చెందిన ఆనంద్(21) నగరానికి వలసవచ్చి కొంపల్లిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. అందులో నివాసం ఉంటున్న వెలగపుడి భవానీశంకర్.. తన ఫ్లాట్‌లో బీరువాలో ఉన్న రూ.52 లక్షల 50 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు ఈ నెల 26న ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆనంద్‌ను అనుమానించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతడి వద్ద ఉన్న రూ.43 లక్షలను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయ్‌వర్ధన్, డీఐ విజయ్, ఎస్ఐ ధర్మేశ్‌తో క్రైం పోలీసులు పాల్గొన్నారు.

నాలాలో శిశు పిండం లభ్యం

జీడిమెట్ల, జనవరి 27 : మూడు నెలల శిశుపిండం నాలాలో లభ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ గడ్డం మల్లేశ్ వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ గంపలబస్తీలోని నాలాలో శిశుపిండం ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పిండాన్ని నాలాలో నుండి వెలికితీశారు. కాగా.. నాలాలో పడిన రక్తం మరకల ద్వారా పైపుమార్గాన్ని గుర్తించి సదరు ఇంట్లో మహిళను పోలీసులు విచారించారు. సదరు మహిళకు గతంలో ముగ్గురు పిల్లలు ఉండగా, మూడు నెలల నుండి పీరియడ్స్ రావడం లేదని, బాత్‌రూంలో ఒక్కసారిగా కడుపునొప్పి రావడంతో రక్తస్రావం ద్వారా శిశుపిండం బయటపడిందని తెలిపింది. వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం పిండాన్ని బాధిత కుటుంబానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల వేలం..

రూ. 56.10 లక్షలు ట్రెజరీలో డిపాజిట్

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకొని, గోషామహల్ పోలీస్ స్టేడియంలో పార్కు చేసిన 537 వాహనాలను బహిరంగ వేలంలో విక్రయించారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని గోషామహల్‌కు మారుస్తుండడంతో స్టేడియంలో పార్కు చేసిన, ఇప్పటి వరకు ఎవరూ క్లెయిమ్ చేయని వాహనాలను ఈ వేలంలో విక్రయించినట్లు సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. ఇందులో 150 మంది బిడ్డర్లు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పాల్గొన్నారని, 355 ద్విచక్రవాహనాలు, 70 మూడు చక్రాల వాహనాలు, 102 నాలుగు చక్రాల వాహనాలు, 10 భారీ వాహనాలను విక్రయించినట్లు తెలిపారు. అలాగే స్క్రాప్‌లో 5 టన్నుల ఐరన్‌ను వేలంలో విక్రయించినట్లు వెల్లడించారు. వేలం ద్వారా రూ. 56.10 లక్షలు రాగా వాటిని ప్రభుత్వం ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు వివరించారు.

గంజాయి విక్రయం..సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీటీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.91లక్షల విలువచేసే 175గ్రాముల కుష్(ఖరీదైన విదేశీ గంజాయి), ఒక కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం...బెంగుళూరులోని డెలైట్ క్యాంపస్‌లో కన్సల్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శివరామ్ గంజాయికి, ఇతర వ్యసనాలకు అలవాటుపడి, వచ్చే జీతం సరిపోక గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో స్థానికంగా ఉండే అజయ్ వద్ద నుంచి గ్రాము గంజాయి రూ.1500చొప్పున కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో రూ.3వేలు చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇందులో భాగంగా ప్రతి వారాంతంలో నగరానికి ట్రావెల్స్ బస్సులో గంజాయి తీసుకువచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ బృందం రాయదుర్గం, గచ్చిబౌలి, ప్రశాంతి హిల్స్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న శివరామ్‌ను డీటీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఒకే వాహనం..మూడు రాష్ట్రాల నంబర్ ప్లేట్లు

ఉప్పల్, జనవరి 27 : మూడు రాష్ట్రాల నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాన్ని సోమవారం ఉప్పల్ ఆర్టీఏ అధికారులు పట్టుకున్నారు. సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా ఉప్పల్‌లో చేపట్టిన సోదాల్లో విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నంబర్ ప్లేట్లతో వాహనం తిరుగుతున్నట్లు గుర్తించారు. ఈమేరకు వాహనాన్ని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, ఏఎంవీఐ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లారీ కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేడ్చల్, జనవరి 27 : లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మేడ్చల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వెళ్తున్న లారీకి అడ్డుగా వెళ్లి దాని కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మొదట ప్రమాదంగా భావించారు. అయితే సీసీ కెమెరాలను పరిశీలించగా తనంత తానే ఆత్మహత్య చేసుకునేందుకు లారీ కింద పడినట్టు పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియాల్సి వుంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలకైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-326945

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 9949520296. NT-326937

BUSINESS OFFER

★Wanted Investors for My Client: 1 Lakh to 1 Crore. Contact: A.M.Suree Goud. Legally, Safe, Secure & Dynamic Investment. Advisor, Advocate, Arbitrator & Legal Advisor. 9391665516, 8106826332. NT-337722

★రన్నింగ్‌లో ఉన్న బిజినెస్ కో సంఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్ కావలెను. ఫోన్: 8106734546. NT-329010

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-326646

VEHICLE FOR SALE

★M/s Indusind Bank Ltd. Vehicle for Sale as is where condition through Open Auction Commercial Vehicle: TS12UE2021. Ph: 9959352196. NT-327016

PLOT FOR SALE

★సాగర్ హైవేలో బొంగుళూరు జంక్షన్ ఆదిభట్ల మున్సిపాలిటీ వద్ద HMDA అప్రూవ్డ్ రెడీ టు కన్‌స్ట్రక్షన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. నియర్ బై TCS, Foxcon. 9000330596. NT-326638

★సాగర్ హైవే ఫేసింగ్ HMDA ఫైనల్ అప్రూవల్స్‌తో ఇబ్రహీంపట్నం గురునానక్ కాలేజీ దగ్గరలో ప్లాట్లు కలవు. బ్యాంక్ లోన్ లభిస్తుంది. 9959875653, 8688385598. NT-337373

★శ్రీశైలం హైవే ఫ్యూచర్ సిటీ, ఫాస్ట్‌గా డెవలప్‌మెంట్ చెందుతున్న హైవే దగ్గర 8 లక్షలకే 200 గజాల ప్లాట్. సంప్ర: 9396882299. NT-329051

HMDA PLOTS

★HMDA, RERA అప్రూవ్డ్ ORR Exit No. 10 బండరావిరాల గేటెడ్ వెంచర్‌లో Premium Villa Plots కలవు. ఆ॥ డె॥ స్పాట్ రిజి॥ విత్ బ్యాంక్ లోన్. ఫోన్: 8464919899. NT-337776

PLOTS & LANDS FOR SALE

★చేవెళ